క్లుప్తంగా

శివాలయాల్లో ప్రత్యేక పూజలు



నందిగామ: నియోజకవర్గ వ్యాప్తంగా పలు శివాలయాల్లో బుధవారం విశేష పూజలు జరిగాయి. స్వామివారి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం నేపథ్యంలో పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి ఆలయంలో రుద్రాభిషేకం చేశారు. ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో స్వామివారికి పంచామృత అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు



నందిగామ: పట్టణంలోని ముక్కోటి మహా మండపంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజైన బుధవారం మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెన్నకేశవస్వామివారికి ఉత్సవమూర్తులకు కూడా విశేష పూజలు చేశారు. సాయంత్రం సమయంలో ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు, హరికథా కాలక్షేపాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాత్రి పొద్దుపోయే వరకు జరిగిన ఈ కార్యక్రమాలలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి అక్షింతల శోభాయాత్ర



పెనుగంచిప్రోలు: అయోధ్యలో రామమందిరం నిర్మాణం పూర్తవుతున్న సందర్భంగా శ్రీరాముడిని పూజించిన అక్షింతలతో బుధవారం పెనుగంచిప్రోలులో శోభాయాత్ర నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న శ్రీఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన ఈ శోభాయాత్ర గ్రామంలోని ప్రధాన వీధుల్లో కొనసాగింది. జైశ్రీరామ్ నినాదాలతో శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, బీజేపీ నాయకులు కల్లూరి శ్రీవాణి, మన్నె శ్రీనివాసరావు, ప్రఫుల్ల శ్రీకాంత్, రామాచారి, అప్పారావు, గోపాలరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాని ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. అమ్మవారి వార్షిక కల్యాణం నిర్వహించే స్థలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా చైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సారథ్యంలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కృషితో రూ.15 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ఆయా పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఆలయ డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు, ఏఈ రాజు, కాంట్రాక్టర్ పాలేటి సతీష్ ఉన్నారు.

చెన్నకేశవస్వామికి లక్ష తులసి పూజ



ముక్త్యాల(జగ్గయ్యపేట): ధనుర్మాసాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీభవానీ ముక్తేశ్వర స్వామి ఆలయంలోగల రాజ్యలక్ష్మీ సహిత చెన్నకేశవస్వామి వారికి బుధవారం లక్ష తులసి పూజను ఘనంగా నిర్వహించారు. లక్ష తులసిదళాలతో అర్చకులు పూజలు నిర్వహించి నవగ్రహహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జయ ప్రకాష్‌బాబు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

జగనన్నకు అండగా ఉందాం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



మునగాలపల్లిలో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న నందిగామ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలిచి, ఆయన మరోసారి ముఖ్యమంత్రి అయ్యేందుకు కృషి చేద్దామని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పిలుపునిచ్చారు. చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని మునగాలపల్లిలో బుధవారం ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయా పథకాల అమలు తేదీలతో కూడిన సంక్షేమ క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ జగన్ మోహనరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక్కో సచివాలయానికి రూ.20లక్షలు మంజూరు చేశారని వివరించారు. రాష్ట్ర ప్రజలకు మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి రానున్న ఎన్నికలలో మద్దతు పలకాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో నాయకులు నల్లాని రమాదేవి, నాల్లాని సాయి, బండారుపల్లి కపిల్, నల్లాని అయ్యన్న, వైఎస్ఎస్ ప్రసాద్, కందుల నాగేశ్వరరావు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నూకానమ్మకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు..



చింతలపాడులో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు మండలంలోని చింతలపాడు గ్రామంలో వేంచేసియున్న నూకానమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ముందుగా అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. రంగురంగుల విద్యుద్దీపాలంకరలో ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తిరునాళ్ల మహోత్సవాల్లో నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జగన్‌మోహనరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



గౌరవరంలో పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు, హాజరైన క్రీడాకారులు



పెనుగంచిప్రోలులో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

జగ్గయ్యపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు రెండోరోజు బుధవారం ఉత్సాహంగా సాగాయి. కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బుదవాడ, అనుమంచిపల్లి, ముక్త్యాల, పోచంపల్లి గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు డి.లక్ష్మి, పానుగంటి త్రివేణి, సయ్యద్ సాధిక్‌బూన్, బి.లక్ష్మి ప్రారంభించారు. గౌరవరంలో బ్యాట్మింటన్ పోటీలను గ్రామ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బాలసైదా, జగదీష్, కార్యదర్శి జగ్గయ్య తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో

పెనుగంచిప్రోలు: ఆడుదాం..ఆంధ్రా క్రీడా పోటీలు పెనుగంచిప్రోలు మండలంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన క్రీడా పోటీలు సచివాలయాల స్థాయిలో నిర్వహిస్తున్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తుండగా, యువత ఆసక్తితో క్రీడలను వీక్షిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. పెనుగంచిప్రోలు కెవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన కబడ్డీ పోటీలను ఎంపీడీఓ హర్షసాయి పర్యవేక్షించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, హెచ్‌ఎం కె.జలజ, పీడీ వెంకటరమణ, బాబూప్రసాద్, పీఈటీ మోహనలక్ష్మి, ఆయా కబడ్డీ జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు.



కొణకంచిలో క్రీడలను ప్రారంభిస్తున్న సర్పంచి గోనెల దేవి, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు

కొణకంచిలో..

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం..ఆంధ్రా క్రీడలు దేశానికే ఆదర్శమని సర్పంచి గోనెల దేవి, వైస్ ఎంపీపీ కనగాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను బుధవారం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 47రోజులపాటు పండుగ వాతావరణంలో నిర్వహించే ఈ పోటీల్లో క్రీడాకారులంతా పాల్గొనాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ కార్యక్రమం ప్రారంభించినా, చరిత్రలో నిలిచిపోయేలా ఉంటోందని కొనియాడారు. ఎంఈవో డి.రవీంద్ర, హెచ్‌ఎం ఎం.రమణ, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, పీఈటీలు పాల్గొన్నారు.

కవులు ప్రపంచశాంతిలో భాగస్వాములు కావాలి



రైటర్స్ మీట్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ బాలకృష్ణ కుర్వే, రవికుమార్

విజయవాడ కల్చరల్: కవులు, రచయితలు ప్రపంచ శాంతిలో భాగస్వాములు కావాలని నోబుల్ పీస్ ప్రైజ్ సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ బాలకృష్ణ కుర్వే అన్నారు. నవభారత నిర్మాణ సంఘం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఫర్ పీస్ డిటైర్‌మెంట్ అండ్ ఎన్విరాల్‌మెంట్ ప్రొటెక్షన్, గాంధీదేశం సోషల్ వెల్‌ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం రైటర్స్ మీట్, కవి సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ కుర్వే మాట్లాడుతూ నేడు ప్రపంచాన్ని ఉగ్రవాదం పట్టి పీడిస్తోందని తెలిపారు. మానవాళిని కాపాడాల్సిన బాధ్యత కవులపై ఉందన్నారు. ప్రజలను చైతన్య పరిచే రచనలు రావాలని అందుకోసం కవులు కృషి చేయాలన్నారు. నవభారత నిర్మాణ సంఘం చైర్మన్ సూరేపల్లి రవికుమార్ మాట్లాడుతూ కవులు సమాజంలో భాగస్వాములని సమాజం కోసం సాహితీ సృజన చేయాలని సూచించారు. మల్లెతీగ సంపాదకుడు కలిమిశ్రీ మాట్లాడారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్ట్ ఘంటా విజయకుమార్, భాషా పరిశోధకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, సాహితీవేత్తలు సత్యస్వాతి, పంతుల వెంకటేశ్వరరావు, చిత్రకారుడు కళాసాగర్ ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు స్వీయ కవితా గానం చేశారు. నిర్వాహకులు వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

● అగ్నిగుండంలో నడిచిన అయ్యప్పలు





జగ్గయ్యపేటలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయం వద్ద బుధవారం రాత్రి అయ్యప్ప పడిపూజ, అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో అయ్యప్ప మాలధారులు నడిచి తమభక్తిని చాటుకున్నారు. ముందుగా ఆలయంలో స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో గురుస్వాములు, అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు. – జగ్గయ్యపేట అర్బన్

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



వత్సవాయి : జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ చేపట్టారు. స్థానిక జెడ్పీ పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యురాలు యేశపోగు దేవమణిశ్రీనివాస్, సర్పంచ్ భూక్యా సీతమ్మ బుధవారం స్ఫూర్తి స్టడీమెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఫైనల్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించాలని సూచించారు.

నేటినుంచి వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభలు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలో ఈనెల 28నుంచి జనవరి 25వతేదీ వరకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు బుధవారం తెలిపారు. 28న కె.అగ్రహారం, జనవరి 1న అన్నవరం, చిల్లకల్లు, 2వతేదీన అనుమంచిపల్లి, వేదాద్రి, 3న బలుసుపాడు, తిరుమలగిరి, 4న గంగ్రాయి, గౌరవరం, 6న షేర్‌మహ్మద్‌పేట, పోచంపల్లి, 7న బండిపాలెం, 8న జయంతిపురం, ముక్త్యాల, 9న మల్కాపురం, 17న తక్కెళ్ళపాడు, 21న రామచంద్రునిపేట, ధర్మవరప్పాడు తండా, 25న బుదవాడ గ్రామాల్లో నిర్వహించనున్నట్లు వివరించారు. అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు.

అయ్యప్పస్వామికి కలశాభిషేకం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం 108 కలశాలతో కలశాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. ఈసందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ అయ్యప్పస్వామి ఆశీస్సులు పట్టణ ప్రజలందరికీ ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి పెద్దసంఖ్యలో అయ్యప్ప దీక్షాపరులు హాజరై స్వామివారికి పూజలు చేశారు.

మత్స్యకారులకు అవగాహన



దరఖాస్తులను అందజేస్తున్న మత్స్యశాఖ అధికారులు

జగ్గయ్యపేట అర్బన్: మత్స్యశాఖ వారి ఆధ్వర్యంలో మత్స్యశాఖ సహకార సంఘాల సభ్యులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మార్కెట్‌యార్డులోని మత్స్యశాఖ అసిస్టెంట్ సెక్రటరీ కార్యాలయం వద్ద వికసిత్ భారత్ యోజన పథకం కింద కేసీసీ కార్డుదారులకు సంబంధిత బ్యాంకుల ద్వారా రుణసదుపాయం పొందే విధానంపై మత్స్యశాఖ సహకార సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. జగ్గయ్యపేట మండలంలోని అనుమంచిపల్లి, జగ్గయ్యపేట, గంద్రాయి, షేర్‌మహ్మద్‌పేట, మల్కాపురం తదితర గ్రామాల మత్స్యకార సహకార సంఘాల సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాల పొందేందుకు అవసరమైన దరఖాస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు పి.పాపారావు, వి.పెద్దిబాబు, వి.లెనిన్‌బాబు పాల్గొన్నారు.

ఈవీఎంలతో సమర్థంగా పోలింగ్ ప్రక్రియ



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న కంచికచర్ల డీటీ నాగుల్‌మీరా

కునికెనపాడు(కంచికచర్ల) : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)తో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అనేక సంస్కరణలను సమర్థంగా అమలుచేస్తోందని తహసీల్దార్ పబ్బ్యారి శంకరబాబు తెలిపారు. మండలంలోని కునికెనపాడులో ఈవీఎంల పనితీరుపై ఓటర్లకు బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా తహసీల్దార్ శంకరబాబు మాట్లాడుతూ ఈవీఎంల ద్వారా పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుకులుగుతుందన్నారు. ఎటువంటి అవకతవకలకు తావు ఉండదని వివరించారు. ఈవీఎం, ఈఈ ప్యాడ్ పనిచేసే విధానం, నోటా వంటి అంశాలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. సర్పంచి బండారుపల్లి సత్యనారాయణ, వీఆర్వోలు ప్రదక్షిణరావు, కె.రామారావు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటు వేసే విధానంపై అవగాహన

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈవీఎంలపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవీఎంలు, వీవీప్యాట్స్ పనితీరును వివరించారు. ఈవీఎంల ద్వారా ఓటు వేసే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట తహశీల్దార్ సూర్యారావు మాట్లాడుతూ ఈవీఎంల ద్వారా ఓటువేసే విధానంపై ఓటర్లంతా అవగాహన కలిగి ఉండి, వారి ఓటుహక్కును సజావుగా వినియోగించుకోవాలని సూచించారు. ఎలక్షన్ డీటీ కిషోర్ బాబు, డీటీ నాగరాజు, ఆర్ఐ ఆనంద్‌బాబు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు

కొణకంచి(పెనుగంచిప్రోలు): మండలంలోని కొణకంచి గ్రామంలో బుధవారం బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవం కార్యక్రమంలో భాగంగా రైతులకు వరిలో విత్తన శుద్ధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఒక కిలో విత్తనాలకు 8 గ్రాముల కార్బెండజిమ్ మందును కలిపి 24గంటల తరువాత నారుమడిలో చల్లు కోవాలని సూచించారు. దుంప నారుమళ్ల అయితే ఒక లీటరు నీటికి 1గ్రాము కార్బెండిజమ్ మందును కలిపి ఆ ద్రావణంలో విత్తనాలను 24గంటలపాటు నానబెట్టి, మరో 24 గంటలు మండె కట్టి మొలకెత్తిన విత్తనాన్ని దుంప నారుమడిలో చల్లుకుంటే పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. విత్తన శుద్ధి చేసుకునే విధానాన్ని రైతులకు అవగాహన కల్పించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సాహో, జగదీష్, నాయక్, మాల్యాద్రి, మదన్, కిరణ్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సానె రామ్మోహనరావు

కంచికచర్ల : పెన్షన్‌దారులు తమ జీవన ధ్రువీకరణ పత్రాలను 2024 జనవరి ఒకటో తేదీ నుంచి ఫిబ్రవరి 29వతేదీలోగా కంచిచర్ల సబ్ ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు సూచించారు. స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘ కార్యాలయంలో కంచికచర్ల, వీరులపాడు మండలాల రిటైర్డ్ ఎంప్లాయిస్ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ సబ్ ట్రెజరీ అధికారి వద్దకు పీపీఓ నంబర్, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్ నంబర్ లింకైన సెల్‌ఫోన్‌ను తీసుకుని వేలిముద్ర వేయడంతోపాటు జీవన ధృవీకరణపత్రాన్ని సమర్పించాలని సూచించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో ఇచ్చిన జీవన ధ్రువీకరణపత్రం చెల్లుబాటు కాదని పేర్కొన్నారు. ఈ అంశంపై ఎటువంటి సందేహాలు ఉన్నా పెన్షనర్స్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, కోశాధికారి చలసాని నాగేశ్వరరావు, సంఘ నాయకులు పెద్దినీడి కోటేశ్వరరావు, కృష్ణమూర్తి, చాపలమడుగు స్వర్ణలత, షేక్ జానిమియా పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే నాయీబ్రాహ్మణులకు సముచితస్థానం



విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయీబ్రాహ్మణ సంఘ నాయకులు

పెనుగంచిప్రోలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే నాయీబ్రాహ్మణులకు రాష్ట్రంలో సముచితస్థానం లభించిందని శ్రీతిరుపతమ్మవారి ఆలయ కల్యాణకట్టలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మణులు తెలిపారు. గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సాధికారక సమితి సమావేశంలో టీడీపీకి చెందిన కొందరు నాయకులు చేసిన అసత్య ఆరోపణలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాయీబ్రాహ్మణులను చంద్రబాబు తోకలు కత్తిరిస్తామని అసభ్యంగా మాట్లాడారని గుర్తుచేశారు. రాష్ట్ర దేవాదాయశాఖ చరిత్రలోనే మొదటిసారిగా సీఎం జగనన్న పాలనలో తమకు ఆలయ పాలకవర్గాల్లో సభ్యులుగా నియమిస్తూ జీవో జారీ చేశారన్నారు. నెలకు రూ.20వేలు వేతనం ఇస్తున్నారన్నారు. జీఓ నెం.50 ద్వారా కులం పేరుతో దూషిస్తే చర్యలు తీసుకునే విధంగా చట్టం చేయడంతోపాటు చేదోడు పథకం ద్వారా షాప్ ఉన్న నాయీబ్రాహ్మణులకు ఏడాదికి రూ.10వేలు ఇస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో తమకు ఎలాంటి మేలు జరగలేదని తెలిపారు. భవిష్యత్తులో టీడీపీ నాయకులు అసత్యాలు మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. సమావేశంలో ఆలయ డైరెక్టర్ కొలిపాక రాము, నాయీబ్రాహ్మణ సంఘ నాయకులు ఏలూరి శ్రీనివాసరావు, కొలిపాక కృష్ణ, దేవరకొండ శ్రీనివాసరావు, కొలిపాక వెంకట్రావు, ఏలూరి కృష్ణ, గోపి, తదితరులు పాల్గొన్నారు.

రూ.26లక్షలతో రోడ్లకు మరమ్మతులు



చిల్లకల్లు-వైరా రోడ్డుకు లింగాల వద్ద కొనసాగుతున్న మరమ్మతు పనులు

వత్సవాయి : ఆర్‌అండ్‌బీ అధికారులు ఆయా రోడ్లకు వార్షిక మరమ్మతులు చేపట్టారు. ఆయా రోడ్లకు మరమ్మతులు చేపట్టాలంటూ జగ్గయ్యపేట ఎమ్మెల్యే, విప్ సామినేని ఉదయభాను అధికారులను ఆదేశించిన నేపథ్యంలో మరమ్మతులు ప్రారంభించారు. ఈ మేరకు రూ.26లక్షల నిధులతో చిల్లకల్లు నుంచి వత్సవాయి, మక్కపేట-పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట-ముక్త్యాల, చిల్లకల్లు-వేదాద్రి, ముళ్లపాడు-పెనుగంచిప్రోలు, షేర్‌మహ్మద్‌పేట-గంద్రాయి రోడ్లకు ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ మరమ్మతు పనులను ఆర్‌అండ్‌బీ డీఈ పరుశరాముడు పర్యవేక్షిస్తున్నారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టడంపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తూ, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

పంటల నమోదు తప్పనిసరి

వత్సవాయి : రబీలో పంటలు సాగుచేసే రైతులు తప్పనిసరిగా పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.రవి కుమార్ బుధవారం తెలిపారు. మొక్కజొన్న, వరి, కూరగాయలతోపాటు పండ్ల తోటలు సాగుచేసే రైతులు విధిగా రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించి పంటల వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.